‘ఉచిత బస్సు’ హుళక్కే

- మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికల్లో హామీ
- అధికారంలోకి వచ్చాక అమలు చేయని కూటమి ప్రభుత్వం
- వాయిదాలతో కాలయాపన చేస్తున్న చంద్రబాబు
- మోసపోయామని మహిళల ఆవేదన


నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు

అల్లిపురం : అంతన్నాడింతన్నాడే చంద్రబాబు... సూపర్ సిక్స్ పథకాలన్నాడే చంద్రబాబు... ఆ సూపర్ సిక్స్ పథకాలు గాలికొదిలాశాడే చంద్రబాబు... అంటూ కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలపై ప్రజలు పాటలు పాడుకుంటున్నారు. అధికారంలోకి రావడానికి అలవికాని హామీలిచ్చిన చంద్రబాబు నాయుడు... ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక వాటిని పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలంటూ పెద్ద ఎత్తున కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం మానేశారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో దసరా, సంక్రాంతి అంటూ రోజుకొక మాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో సర్వత్రా కూటమి ప్రభుత్వంపై మహిళలు విమర్శలు గుప్పిస్తున్నారు. నియోజకవర్గంలో అల్లిపురం, భీమ్‌నగర్, కొబ్బరితోట, భూపేష్‌నగర్, పూర్ణామార్కెట్, రెల్లి వీధి, పాతనగరంతోపాటు, జాలరిపేట, పాతపోస్టాఫీసు ప్రాంతాల్లో అధికంగా పేద ప్రజలు, వివిధ పనులు, కాలేజీలు, ఆస్పత్రులు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి నిత్యం నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోని కాలేజీలకు, కార్యాలయాలకు మహిళలు, విద్యార్థినులు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో **కూటమి** ప్రభుత్వం ఇచ్చిన హామీని **ఖచ్చితంగా** అమలు చేయాలని వారంతా **కోరుతున్నారు.**

పండగల పేరుతో కాలయాపన

మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మహిళలు విమర్శిస్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ కప్పదాటు ప్రయత్నాలు చేస్తున్నారని దుమ్మెత్తి పోస్తున్నారు. పండగలు వస్తున్నాయి, వెళ్తున్నాయి కానీ ఉచిత బస్సు ప్రయాణంపై కూటమి నాయకులు స్పష్టమైన ప్రకటన చుయడం లేదని మహిళలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలోని మహిళలు కోరుతున్నారు.

హామీ ఇవ్వడమెందుకో..?



మహిళలను ఆకర్షించేందుకు ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని కూటమి నేతలు హామీనిచ్చారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పథకం గురించి మాట్లాడకపోవడం దారుణం. మహిళలకు హామీ ఇచ్చిన ప్రకారం ఉచిత బస్సు పథకాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలి. **– యల్లంకి ఝాన్సీ**, కుమ్మరవీధి, అల్లిపురం

హామీలు అమలు చేయాలి



సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని వెంటనే అమలు చేయాలి. ప్రతి పండగకు పథకం అమలు చేస్తామంటూ చెబుతున్నారే తప్ప ఆచరించడం లేదు. మహిళలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ప్రజలు ఓట్లేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కాలయాపన చేయడం సరికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత బస్సు హామీపై మహిళలకు సమాధానం చెప్పాల్సిందే. **– దుంప గుణవతి**, బంగారుమెట్ట, అల్లిపురం

మహిళలకు నమ్మక ద్రోహం



కూటమి నాయకుల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. అమలు చేస్తారన్న నమ్మకం కూడా సన్నగిల్లుతోంది. ఇదిగో.. అదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం సరికాదు. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. **– జి.మానస**, వెంకటేశ్వరమెట్ట, అల్లిపురం

వైభవంగా శ్రీనివాస కల్యాణం


అలంకరణలో శ్రీ భూ సమేత శ్రీనివాసుడు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై గల అలివేలు మంగమ్మ ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం సాయంత్రం శ్రీ భూ సమేత శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు పానంగిపల్లి రంగనాథాచార్యులు, పానంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ భూ సమేత శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా వివాహ తంతు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం ముత్యాల తలంబ్రాలు వేడుక కనులపండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొని భక్తి పారవశ్యంతో మునిగితేలారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన నాట్యోత్సవం

సీతంపేట : శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, టీటీడీ పూర్వ ఈవో, తెలంగాణా ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినం సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ సంగీత నాట్యోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది చిన్నారులు చేసిన సంగీత, నృత్య ప్రదర్శన అలరించింది. వీరికి అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా నాట్య గురువులు తాళ్లపాక సందీప్‌కుమార్, ఎ.కృత్తిక, కె.కరుణామోహన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మీగడ శశిభూషణ స్వామి, ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌందర్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

సామూహిక గీతా పారాయణ


శ్రీకృష్ణ భగవానుని సన్నిధిలో భక్తులు

డాబాగార్డెన్స్ : పాతనగరం రాజప్పనాయుడు వీధిలో గల శ్రీగీతా భవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు సామూహికంగా సంపూర్ణ గీతా పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. విశ్వరూప సహిత శ్రీకృష్ణార్జునుల ప్రతిష్టామూర్తులు, గోసమేత శ్రీకృష్ణ భగవానుని ఉత్సవమూర్తిని ఆలయ అర్చకుడు సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, గీతా ప్రచార సమితి కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, రేవలి, ప్రమీల, జి.విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయంలో భీష్మ ఏకాదశి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో జి.వి.రమాభాయి పర్యవేక్షణలో శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎరుకుమాంబ అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలో హరిహరనామ సంకీర్తన, ఏకాహ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భజన బృందాలుచే గీతాలాపనలు, సంకీర్తనలు జరిగాయని ఆలయ ఈవో జి.వి.రమాభాయి తెలిపారు. ఈ భజన కార్యక్రమం ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటలూ కొనసాగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ పితాని సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు


విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి

అల్లిపురం : భీష్మ ఏకాదశి సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామికి విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని పుష్పమాలికలు, తులసి మాలలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు చేశారు. అల్లిపురం మెయిన్ రోడ్డులోని కోదండ రామాలయం, కుమ్మరవీధిలోని రామాలయం, గోవింద్ రోడ్డులోని రాంరాం దేవాలయం, మెయిన్‌రోడ్డులోని శ్రీ రామాలయంలో విశేష పూజలు నిర్వహించారు.

సిరులతల్లికి తులసీదళార్చన


తులసీ దళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

- చంద్రబాబు, లోకేష్, పవన్‌పై ప్రజలే తిరగబడతారు
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : ‘‘మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలు ఆపలేదు. వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి కరోనా సమయంలోనూ సేవలందించారు. ప్రాణాలకు తెగించి సేవలందించిన వలంటీర్లను కూటమి ప్రభుత్వం విస్మరించడం తగునా..?’’ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బాబుకి వత్తాసు పలుకుతున్న పవన్ కల్యాణ్‌ను మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక 9 నెలలు కావస్తున్నా ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు.

ప్రభుత్వం స్వచ్ఛందంగా తప్పుకోవాలని సూచించారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను ఇంకా మోసం చేయొద్దని కోరారు. పోలీసుల సహకారం లేకుండా చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్ కల్యాణ్ రోడ్డుపైకి వస్తే ప్రజా తిరుగుబాటు తప్పదన్నారు. మరో మూడు నెలల్లో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా... సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. అధికారం కోసం రాష్ట్ర ప్రజల్ని మోసం చేశారని... ఇంతకన్నా దారుణం మరొకటి ఉండదన్నారు.

కరోనా సమయంలోనూ పథకాల అమలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏడాదికి రూ.60 వేల కోట్ల సంక్షేమ పథకాలు అవినీతికి తావులేకుండా నేరుగా ప్రజలకు అందజేశారని గుర్తు చేశారు. కరోనా సమయంలోనూ రూ.2.75 లక్షల కోట్లతో సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా పథకాలు అమలు చేయడం లేదని, ఆ డబ్బులన్నీ ఏమైపోతున్నాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని ఆరోపించారు. చంద్రబాబునాయుడుకి, యనమల రామకృష్ణుడికి అపారమైన అనుభవం ఉందని... అందుకే అమలు చేయలేని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి నాయకుల హామీలు అమలు చేయడం సాధ్యం కాదని ఎన్నికల సమయంలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబుని ఛీకొట్టి బయటకొచ్చిన పవన్ కల్యాణ్... మళ్లీ చంద్రబాబు పక్కకే వెళ్లాడన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోయినా పవన్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంటే నోరెందుకు మెదపడం లేదన్నారు. ప్రజలకిచ్చిన హామీలపై ప్రశ్నించాలని, చంద్రబాబుకి వత్తాసు పలకొద్దంటూ హితవు పలికారు. అమ్మ ఒడి, 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి... ఇలా ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. మత్స్యకారులకు ఏటా వేట నిషేధ సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి రూ.10వేలు భృతి ఇచ్చేవారని, వాటితో బోట్లు మరమ్మతులు చేయించుకునేవారన్నారు. ఈ ఏడాది భృతి ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని వాసుపల్లి ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్ : విశ్వశాంతిని కాంక్షిస్తూ నగరంలోని గొల్లలపాలెం, సింగ్‌హోటల్ జంక్షన్, శివాలయం వీధిలో గణేష్ పార్వతి సమేత శ్రీ ఓంకార శివాలయం, ఓం సాయిబాబా (షిర్డీ) మందిరంలో శనివారం శివపార్వతుల కల్యాణం, ఆలయ 30వ వార్షికోత్సవం, ఓం సాయిబాబా 19వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి కల్యాణం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 10.05 గంటలకు శివపార్వతుల కల్యాణం జరిపారు. అనంతరం మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు గొల్లలపాలెం పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ జరిపారు. గొల్లలపాలెం, లలితానగర్, విశ్వనాథ్ రోడ్డు, పితానిదిబ్బ, కన్నయ్యపేట, ప్రకాశరావుపేట, చాకలిపేట, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఓంకార శివసాయి ఆలయ కమిటీ ప్రతినిధులు వడ్ల రామారావు, వడ్ల కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వసుధ ఫార్మా ఉద్యోగుల వితరణ


ఆర్థిక సాయం అందజేస్తున్న మంతెన వెంకట రామరాజు

డాబాగార్డెన్స్ : స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థకు వసుధ ఫార్మా ఉద్యోగులు ఆర్థిక సాయం అందజేశారు. వసుధ ఫార్మా సంస్థ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సలహాలు, సూచనలతో సంస్థ ఉద్యోగులు రూ.లక్ష విరాళాన్ని శనివారం ఆశ్రమ ప్రధాన కార్యదర్శి ఉమాదేవి, సంస్థ ముఖ్య సభ్యుడు పి.ఈశ్వరరావుకు అందజేశారు. అనంతరం వెంకట రామరాజు మాట్లాడుతూ వివేకానంద సంస్థ చేస్తున్న సేవలు తెలుసుకుని సభ్యులను అభినందించారు. నిత్యాన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించాలని, సేవా కార్యక్రమాలు మరింత విజయవంతంగా నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వి.దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేరరహిత సమాజం


కరపత్రాలతో మత్స్యకారులు, సీఐ జీడీ బాబు

మహారాణిపేట : ప్రజల భద్రత కోసం ‘మీ కోసం – మీ పోలీస్’ అనే కరపత్రాన్ని సీఐ జీడీ బాబు విడుదల చేశారు. బీచ్ రోడ్డులోని మత్స్యకారుల కమ్యూనిటీ హాలులో మత్స్యకార సంఘాల నాయకులతోపాటు ప్రజల సమక్షంలో మత్తు పదార్థాల ప్రభావం, సైబర్ క్రైమ్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పరిస్థితుల్లో అయినా పోలీసులను సంప్రదించవచ్చన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీఐ సూచించారు. ప్రజల సహకారంతోనే నేర రహిత సమాజంగా మార్పు చేయవచ్చన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటికి చేరిన ఇండోర్ మహిళ


మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా టీం సభ్యులు

సీతమ్మధార : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సిటీకి చెందిన పార్వతి (65) అనే వృద్ధురాలిని శ్రద్ధా టీం సభ్యులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమెకు ముగ్గురు కొడుకులు, కోడళ్లు ఉన్నప్పటికీ కొన్నాళ్ల కిందట విశాఖ వచ్చేసింది. గత ఏడాది అక్టోబర్ 5న ఆమెను రైల్వే స్టేషన్‌లో ఏయూటీడీ సిబ్బంది గుర్తించి ద్వారకానగర్‌లో గల టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ – ఏయూటీడీ మహిళా షెల్టర్ హోమ్‌కి తరలించారు. అనంతరం ఆమె వివరాలు సేకరించి ఇండోర్‌లో నివసిస్తున్న కొడుకు జితేంద్ర చౌహాన్ వద్దకు శనివారం తీసుకెళ్లి అప్పగించామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



కుటుంబ సభ్యులకు సిరాజ్‌ని అప్పగిస్తున్న హెచ్‌సీ సత్యనారాయణ, ప్రగడ వాసు

సీతమ్మధార : హైదరాబాద్‌కి చెందిన వ్యక్తిని ఎట్టకేలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానసిక ఆరోగ్యం సరిగ్గా లేక హాస్పిటల్‌కి అని చెప్పి విశాఖ వచ్చిన మొహమ్మద్ సిరాజ్ (55)కు ఫోర్తుటౌన్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సమాచారంతో ఏయూటీడీ టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ షెల్టర్‌లో గతంలో ఆశ్రయం కల్పించారు. అనంతరం అతని వద్ద ఉన్న ఫోన్ నంబర్‌తో వారి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో వారు శనివారం ద్వారకానగర్ టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహానికి చేరుకున్నారు. ఈ మేరకు వసతిగృహంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సమక్షంలో సిరాజ్‌ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

తక్షణమే కుల గణన చేపట్టాలి


నియామకపత్రం అందుకుంటున్న వెంకటరమణ

డాబాగార్డెన్స్ : రాష్ట్రంలో బీసీ జనాభాను తక్కువగా చూపే ప్రయత్నం జరిగిందని, ప్రభుత్వం తక్షణమే కుల గణన చేపట్టాలని ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాష్ట్రాల్లో గల 50 బీసీ సంఘాలను ఒకే తాటిపైకి తీసుకురావడమే బీసీ వెల్ఫేర్ జేఏసీ ముఖ్యోద్దేశమన్నారు. బీసీల్లో అట్టడుగు వర్గాలను సమీకరించి, ఫలాలు అందరికీ అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. రానున్న రోజుల్లో పటిష్టమైన జేఏసీ ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఇందులో భాగంగానే జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా బూరాడ వెంకటరమణను నియమించామని ఆదిశేషు తెలిపారు. జేఏసీ గౌరవ అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ త్వరలో పూర్తిస్థాయిలో విశాఖ జిల్లా బీసీ వెల్ఫేర్ జేఏసీ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి బొడ్డేటి రఘు, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ నాగేశ్వరి, అమిత్ భాషా, భగవాన్, కె.వెంకటవేణు, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

పోలీసుల స్వచ్ఛ భారత్

మహారాణిపేట : బీచ్‌రోడ్డులోని గాంధీ బొమ్మ వద్ద పొదలు, ముల్ల కంచెలు తొలగించి స్వచ్ఛభారత్ చేపట్టారు. వీటి వల్ల అసాంఘిక కార్యక్రమాల జరుగుతున్నట్టు ఆరోపణలు రావడంతో తొలగించాలని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు, జీవీఎంసీ జోన్ – 4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. అనంతరం చీకటిగా ఉండే ప్రాంతంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టారు. స్థానిక యువకులు కూడా పోలీసులు, సిబ్బందికి సహకారం అందించారు.

శ్రమైక జీవనం



పట్టణీకరణ నేపథ్యంలో స్త్రీ, పురుషులు సమానంగా ఏదో ఒక పని చేయాల్సిందే. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో నిర్మాణ పనులు నిరంతరం జరుగుతుంటాయి. ఇందుకు ఎంతో మంది కార్మికులు నిత్యం అవసరమవుతారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు భవన నిర్మాణ కార్మికులుగా, కూలీలుగా మారి **కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు.** అల్లిపురం ప్రాంతంలో కూలి కోసం వచ్చిన మహిళలంతా మాట్లాడుకుంటుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. వీరు కాయకష్టం చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఏవీఎన్ కళాశాలలో క్రీడా పోటీలు


క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

డాబాగార్డెన్స్ : భారత ప్రభుత్వం కేంద్ర యువజన, వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఏవీఎన్ కళాశాలలో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. యువతీ, యువకుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ ఫిట్ ఇండియాలో భాగస్వాములను చేసేందుకు క్రీడలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల అవగాహన కల్గి ఉండాలన్న ఉద్దేశంతో నెహ్రూ యువకేంద్రం దేశ వ్యాప్తంగా పోటీలు నిర్వహిస్తోందని నెహ్రూ యువ కేంద్రం ఉప సంచాలకుడు జి.మహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు తెలిపారు. క్రీడా పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, లాంగ్‌జంప్, హైజంప్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్.గోపీకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.